క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన పలువురు ఎస్‌ఐలు

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్‌ఐలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొమురవెల్లి ఎస్‌ఐగా నాగరాజు, కోహెడ ఎస్‌ఐగా తిరుపతి, బెజ్జంకి ఎస్‌ఐగా నరేందర్‌రెడ్డి, ఎస్‌బీ ఎస్‌ఐగా బా లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా సీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

'పెండింగ్ పనులు పూర్తి చేయండి'

గజ్వేల్: పట్టణంలో ఢిల్లీవాలా హోటల్ వద్ద నుంచి కోటమైసమ్మ గుడి వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అధికారులకు సూచించారు. సోమవారం రోడ్డు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పనులు పెండింగ్‌లో ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పనులు పూర్తయినందున విస్తరణ సైతం వెంటనే పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, టీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, కౌన్సిలర్ కురాకుల శ్రీనివాస్, మామిడి విద్యారాణి, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా పాల్గొన్నారు.

బ్రిడ్జికి మరమ్మతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌లో కాళేశ్వరం కాల్వ పనుల్లో నిర్మించిన బ్రిడ్జి ఇటీవల వర్షాలకు ఒకవైపు కూలిపోవడంపై 'సాక్షి'లో జూలై 30న కూలిన బ్రిడ్జి కథనం ప్రచురితమైంది. డీఈ రూప్‌సింగ్ స్పందించి సోమవారం బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి ఒక భాగాన పనులు కొనసాగుతుండగానే వర్షాలకు కూలిందని... మరమ్మతు పనులు ప్రారంభించామని తెలిపారు.

బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి



అభివాదం చేస్తున్న బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు

గజ్వేల్‌రూరల్: బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించే వరకు తమ పోరాటం ఆగదని బీసీ కులాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని టీవైఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ బీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీ రాజ్యాధికారాన్ని సాధించాలనే లక్ష్యంతో గజ్వేల్ నియోజకవర్గం కేంద్రంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీసీ కులాల ఐక్యవేదిక ఉద్యమం ఇక్కడి నుండే ప్రారంభించి నియోజకవర్గస్థాయిలో బలోపేతం చేసిన తర్వాత ఇతర జిల్లాల వారీగా ఉద్యమాన్ని చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక సభ్యులు కామల్ల ఐలయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ జెడ్పీటీసీలు సింగం సత్తయ్య, యాదవ్ గౌడ్, నాచారం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, అక్కారం సర్పంచ్ బాల్‌చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

'రైతుబీమా'కు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు(గజ్వేల్): ములుగు క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు రైతుబీమా కోసం ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ములుగు ఏఈఓ పృథ్వీరాజ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 18లోగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది ఉండాలని సూచించారు. రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, రైతు, నామిని ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను జతచేయాల్సి ఉంటుందన్నారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న పయ్యావుల శ్యామ్ యాదవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిల భారత యాదవ మహాసభ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పయ్యావుల శ్యామ్ యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి యాదవ్, జిల్లా అధ్యక్షుడు మామిండ్ల ఐలయ్య యాదవ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు ఎల్లం యాదవ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు రాములు యాదవ్, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'తిగుల్' పోరుకు ఏడాది

మండల ఏర్పాటుకు కొనసాగుతున్న దీక్షలు



నినాదాలు చేస్తున్న మండల సాధన సమితి సభ్యులు(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌ను నూతన మండలముగా ఏర్పాటు చేయాలని కోరుతూ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నేటితో ఏడాది పూర్తి చేసుకున్నాయి. గతేడాది ఆగస్టు 1వ తేదీన గ్రామంలో దీక్షలను ప్రారంభించారు. అప్పటి నుంచి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గం కావడంతో మండల ప్రకటనపై ఆశలు పెట్టుకున్నారు.

జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో 5 వేలకు పైగా జనాభా ఉండగా, 3,400 మంది ఓటర్లు ఉన్నారు. మండల వ్యవస్థ ప్రారంభం నుంచే తిగుల్ మండల ఏర్పాటు కావాలన్న డిమాండ్ ఉంది. సీఎం కేసీఆర్ 2016లో గజ్వేల్ నియోజవర్గంలోని మర్కూక్‌ను ప్రకటించారు. ఆ సమయంలో జగదేవ్‌పూర్ నుంచి ఐదు గ్రామ పంచాయతీలను కలుపుకున్నారు. దీంతో తిగుల్‌ను సైతం మండలముగా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సీఎం కేసీఆర్ వ్యవసాయక్షేత్రం ఎదుట ధర్నా చేశారు. అయితే గతేడాది జిల్లాలో మూడు మండలాలను ప్రకటించారు. వెంటనే తిగుల్ గ్రామస్తులు మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ జూలై 29న మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఏడు ఎంపీటీసీలను తీసుకువస్తే మండలం చేస్తామని చెప్పడంతో ఆగస్టు 1 నుంచి గ్రామంలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.

ప్రభుత్వం స్పందించాలి

తిగుల్ మండలముగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. ఎనిమిది గ్రామాల ప్రజలు మద్దతు ఉంది. 2016లో కొత్త మండలాలను ప్రకటించినప్పుడు తిగుల్‌ను చేయాలని కోరుతూ సీఎం దృష్టికి తీసుకెళ్లాం. మండల సాధన సమితి ఆధ్వర్యంలో నిరహార దీక్షలు చేపట్టి నేటికీ ఏడాది పూర్తయింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి.

– భానుప్రకాష్‌రావు, సర్పంచ్, తిగుల్

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కడవేర్గు–పోతిరెడ్డిపల్లి గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణానికి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్‌తో కలసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రతిపక్షాలు అధికార పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వాల పాలనలో చిన్న వర్షం కురిసిన చెరువులన్నీ గండి పడేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో రాష్ట్రంలోని అన్ని చెరువులు మిషన్ కాకతీయ ద్వారా మరమ్మతులు చేపట్టి గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ 90 నుంచి 100 ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శభాషుగూడెం, కడవేర్గు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు కొమ్ముల స్వప్న, వెంకటేశ్, కత్తుల కృష్ణవేణి, ఎంపీటీసీ గదరాజు యాదగిరి, పోతిరెడ్డిపల్లి ఎంపీటీసీ బాలరాజు, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించే రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమేనని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో నియోజకవర్గ పాస్టర్ల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని మతాలు, కులాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మాదిరిగా క్రైస్తవులకు కూడా ఒక పథకాన్ని రూపకల్పన చేస్తున్నామని వివరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల నుంచి క్రిస్టియన్లుగా మారిన వారికి వివిధ పథకాలు వర్తింపచేస్తామన్నారు. చర్చిల నిర్మాణానికి ప్రత్యేక అనుమతి విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఏళ్ల తరబడి నిరాదరనకు గురైన గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్, జెడ్పీటీసీ నాగరాజు శ్యామల, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్రె శ్రీహరి, ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) నాయకులు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ అహ్మద్ హుస్సేన్‌కు తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమ జాగరణ కార్యాచరణలో భాగంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డితో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి వేతన సవరణ సంఘం కాల పరిమితి ముగిసి, రెండవ వేతన సవరణ సంఘాన్ని వేయాల్సిన ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. తపస్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉద్యమ జాగరణ పేరుతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10న జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయ వద్ద ధర్నా 19న హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీధర్, రాష్ట్ర బాధ్యులు నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కరచారి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

లెర్నింగ్ లైసెన్స్‌ల అందజేత



లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక: మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉచిత లైసెన్స్‌లకు స్లాట్ బుక్ చేసుకున్న దుబ్బాక, మిరుదొడ్డి మండలాలకు చెందిన 392 మంది యువకులకు సోమవారం సిద్దిపేట ఆర్టీఓ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లను బీఆర్‌ఎస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ ఇర్షద్ హుస్సేన్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేపూరి శేఖర్‌గౌడ్, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సహకారంతో దుబ్బాక మండలంలోని పెద్ద గుండవెల్లి, రఘోత్తంపల్లి గ్రామాలకు చెందిన 120 మంది యువతీ, యువకులకు బీజేపీ నాయకులు లెర్నింగ్ లైసెన్స్‌లు అందించారు.

దుబ్బాకను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా 30 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. దుబ్బాక మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు ప్రజలు, పాలకమండలి, సిబ్బంది సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ గణేశ్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ బాలకిషన్‌గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వైద్యసిబ్బంది

సిద్దిపేటకమాన్: జిల్లా వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో సోమవారం కలిశారు. ఇటీవల ప్రకటించిన ఏఎన్‌ఎంల భర్తీ నోటిఫికేషన్‌కు సంబంధించి పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

'ఆపన్నహస్తం' సేవలు మరువలేనివి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



నిత్యావసర సరుకుల డీసీఎంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: ఆపన్నహస్త మిత్రబృందం చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కొనియాడారు. ములుగు జిల్లాలోని వరద బాధితులకు గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్రబృందం ఆధ్వర్యంలో రూ. లక్ష విలువైన నిత్యావసర సరుకులు, కిరాణం, కూరగాయలతో వెళ్తున్న డీసీఎంకు మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా నిలుస్తూ అనారోగ్యం బారిన పడిన వారిలో మనోధైర్యం కల్పిస్తూ ఆర్థికసాయం అందిస్తున్న ఆపన్నహస్త మిత్రబృందం సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యాం, ఉపాధ్యక్షుడు మంగలిసాయి, సహాయ కార్యదర్శి కొలిచెలిమి స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

పొలాలు సందర్శించి.. సూచనలు ఇచ్చి..



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ రాజు

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలంలోని వ్యవసాయ విస్తరణాధికారులు పొలం బాట పట్టారు. దౌల్తాబాద్ ఏఈఓ అంబటి రాజుగౌడ్ సోమవారం మండల పరిధిలోని ఉప్పర్‌పల్లిలో పర్యటించి వరిచేలను సందర్శించారు. ఈసందర్భంగా మొవ్వ పురుగు నివారణకు సంబంధించి పలు సూచనలు చేశారు. అలాగే దోమపోటు నివారణకు కాలి బాటలు ఏర్పాటు చేయించారు. అలాగే అహ్మద్‌నగర్‌లో ఏఈఓ ప్రవీణ్ పర్యటించి పంటలను నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్క రైతు తాము సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తిర్మలాపూర్‌లో ఏఈఓ మాధవి పర్యటించారు.

మర్కూక్(గజ్వేల్): వరిలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ నాగేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు.

గ్రామస్తులు ఐక్యంగా ఉండాలి

మద్దూరు(హుస్నాబాద్): కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా కోఆపరేటివ్ డైరెక్టర్ యాదగిరి అన్నారు. సోమవారం వల్లంపట్లలో పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ సంతోష్ అన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కమలాయపల్లిలో అధికారులు సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం



కూచనపెల్లి వాగును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, నాయకులు

హుస్నాబాద్‌రూరల్: పేదల పక్షాన నిలబడేది కాంగ్రెస్ మాత్రమేనని.. అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం కూచనపెల్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు కూచనపెల్లి, మాలపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం లేక రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. గ్రామంలో ఒక్కరికి డబుల్ బెడ్రూం రాలేదని చెప్పారు. ఈసందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేయలేదని దళితులకు మూడెకరాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ముత్యాల సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చందు, యాదవరెడ్డి పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

క్షీరాభిషేకం

సిద్దిపేటకమాన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి ఫ్లెక్సీకి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు మంత్రి హరీశ్‌రావు లేబర్ కార్డు ద్వారా వచ్చే లబ్ధిని, ఆరోగ్యశ్రీ సేవల ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని ప్రకటించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తను తొలగిద్దాం..



అదనపు కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చెత్తను తొలగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో కలియ తిరిగి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, వైస్ చైర్మన్ కనకరాజు, 2వ వార్డు కౌన్సిలర్ నాయిని చంద్రం. తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటరూరల్: సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

దుబ్బాక: దుబ్బాక ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గంగరాజును దుబ్బాక మున్సిపల్ పాలకవర్గం సోమవారం ఘనంగా సన్మానించింది. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి ఆయనకు స్వీటు తినిపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాజమౌళి పంతులు పాల్గొన్నారు. అలాగే నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు చెక్కపల్లి మహేష్ ఎస్‌ఐని సన్మానించారు.

◆ **ఎక్సైజ్ సీఐగా పవన్‌రెడ్డి**



హుస్నాబాద్: హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐగా పవన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఎక్సైజ్ ఎస్సై దామోదర్ ఇంచార్జి సీఐగా పని చేస్తున్నారు. హన్మకొండ ఎక్సైజ్ ఎస్సైగా, వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన పవన్‌రెడ్డి ప్రమోషన్‌పై హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐగా బదిలీపై వచ్చారు.

◆ **బీమా చెక్కు పంపిణీ**

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన గుండవెల్లి స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా గతంలో దుబ్బాక ఎస్‌బీఐ బ్యాంక్‌లో స్వామి పేరిట కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మి సంజీవరెడ్డి రూ.10 లక్షల ప్రమాద ఇన్సురెన్స్ చేయించారు. దీంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆమె అందించారు.

◆ **హరితహారంలో భాగస్వాములు కావాలి**

మద్దూరు(హుస్నాబాద్): హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం అన్నారు. సోమవారం మండలంలోని మర్మములలో సర్పంచ్ సుందరగిరి స్రవంతి పర్షరాములుతో కలిసి మొక్కలను పంపిణీ చేశారు.

◆ **అర్హులకు 'దళితబంధు' అందించండి**

సిద్దిపేటరూరల్: జిల్లావ్యాప్తంగా అర్హులైన ప్రతీ దళిత కుటుంబానికి ప్రభుత్వం దళితబంధు అందించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

◆ **వాహనదారులు నియమాలు పాటించాలి**

దుబ్బాక: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించపోతే చర్యలు తప్పవని దుబ్బాక ఎస్సై గంగరాజు హెచ్చరించారు. సోమవారం పట్టణంలో వాహన తనిఖీ చేపట్టి పత్రాలు సరిగా లేని 12 మందికి రూ.1600 జరిమానా విధించారు.

◆ **ఈవీఎంలపై అవగాహన**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి, మోత్కులపల్లి, కేశవాపూర్, మంచినీళ్లబండ, పెద్దతండా గ్రామాల్లో సోమవారం ఈవీఎం మిషన్లపై రెవెన్యూ శాఖ ఆర్‌ఐ సుహాసిని ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

◆ **కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి**

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనలో భాగంగా ఈనెల 4న మద్దూరు, దూళ్మిట్ట, చేర్యాల, కొమురవెల్లి మండలాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడిని నిర్వహిస్తామని చేర్యాల రెవెన్యూ జేఏసీ నాయకుడు ఆలేటి యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జేఏసీ కో కన్వీనర్ రామడుగు బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మద్దూరు గ్రామ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాచకొండ ఉప్పలయ్య, కన్వీనర్‌గా బూరుగు రాజును ఎన్నుకున్నారు.

◆ **పేదల కోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం**

మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మండలంలోని పాములపర్తిలో కంపెనీ ప్రతినిధి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఇటీవల డబుల్‌బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయగా సోమవారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను తహసీల్దార్ భాగ్యరేఖతో కలిసి అందించారు. కార్యక్రమంలో నాచారం దేవాలయం మాజీ చైర్మన్ హరిపంతులు, నాయకులు మహేష్, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **క్రైస్తవుల శాంతి ర్యాలీ**

హుస్నాబాద్: మణిపూర్‌లో దేవుడు శాంతిని చేకుర్చాలని కోరుతూ సోమవారం పట్టణంలో హుస్నాబాద్ నియోజకవర్గ పాస్టర్స్, క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు.

మద్దూర్‌లో..

మద్దూరు(హుస్నాబాద్): మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మండల కేంద్రంలో ఆయా గ్రామాల పాస్టర్లు, క్రైస్తవ సంఘాలు అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ కనకమ్మ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **సెల్‌ఫోన్ అందజేత**

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిద్దిపేట టూటౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితుడికి సోమవారం అందజేశారు. సిద్దిపేట హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన రఘుపతిరెడ్డి మే 25వ తేదీన పట్టణంలో తన సెల్‌ఫోన్‌ను పొగొట్టుకున్నాడు. దీంతో అతడు సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ యాప్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. అనంతరం సోమవారం ఫోన్ రికవరీ చేసి బాధితుడికి అందజేశారు.

◆ **నిరసన**

బెజ్జంకి(సిద్దిపేట): ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిస్తామని శిలాఫలకానికే పరిమితమయ్యారని బేగంపేటలోని పలు పేద కుటుంబాలు కేటాయించిన స్థలంలోనే గుడిసెలు వేసుకుని నిరసన తెలిపారు. వీరికి బీఎస్పీ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం, జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వెంకన్న, సంపత్, పెద్దాల శ్రీనివాస్, ప్రభాకర్, రాజమల్లు, పర్షరాములు, ఉప్పలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **పరమేశ్వరీ మాతకు 33 రకాల ప్రసాదం**



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉమా మహేశ్వర దేవాలయంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం వాసవీ మాతకు 33 రకాల ప్రసాదాలను ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు సమర్పించారు.

◆ **మరో నలుగురికి వాంతులు, విరేచనాలు**

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్, దుంపలపల్లి గ్రామాల్లో సోమవారం మరో నలుగురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. గ్రామాల్లో గత మూడు రోజులుగా వైద్య శిబిరాలు కొనసాగుతూనే ఉన్నాయి. వెంటనే వారిని 108లో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 15 మందికి పైగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పద్మశాలిగడ్డ, నర్లెంగడ్డలో వాంతులు, విరేచనాలు తగ్గాయని మెడికల్ ఆఫీసర్ భార్గవి తెలిపారు.